
సాక్షి చిత్తూరు
శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



ముగిసిన లక్ష కుంకుమార్చన

బోయకొండ గంగమ్మ ఆలయంలో లక్షకుంకుమార్చన పూజలు వైభవంగా ముగిశాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. - 8లో



భక్తుడికే తొలిపూజ

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం కన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. - 8లో



మామిడిలో తెగుళ్ల నివారణ

మామిడికి పూత దశలో కనిపించే తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన అధికారులు సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

మాతృభాషా దినం.. మరిచిన వర్సిటీ అధికారులు

– ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భాషాభిమానులు



ద్రావిడ విశ్వవిద్యాలయం

కుప్పం : ద్రావిడ భాషల పరిరక్షణకు ప్రత్యేకంగా ఎంతో ఉన్నతాశయంతో కుప్పంలో ఏర్పాటు చేసిన ద్రావిడ విశ్వవిద్యాలయంలో మాతృభాషా దినోత్సవాన్ని విస్మరించారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా అన్ని విద్యాలయాల్లో విద్యార్థులకు మాతృభాషపై అవగాహన కల్పిస్తారు. అయితే ఉన్నత విద్యాలయమైన ద్రావిడ వర్సిటీలో మాత్రం ఇందుకు భిన్నంగా మారింది. చిన్న, పెద్ద భాషలన్నింటిని రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మన జీవ వైవిధ్యం కాపాడుకోగలుగుతామన్న ఉద్దేశంతో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడకలను జరుపుకుంటారు. విద్యార్థి దశ నుంచే మాతృభాషా ప్రాముఖ్యంపై అవగాహన కల్పించాల్సిన వర్సిటీ అధికారులు అసలు మాతృభాషా దినోత్సవాన్నే విస్మరించారు. దీనిపై భాషాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విశ్వంలో సైనిక్ ఉచిత నమూనా పరీక్ష రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజ నగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఉచితంగా సైనిక్ నమూనా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. సైనిక్ స్కూల్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించే ప్రవేశ పరీక్షకు అనుగుణంగా నమూన పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సైనిక్ ప్రవేశ పరీక్ష, పరీక్షా విధానం తదితర అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

23న గంటా కమలమ్మ సాహితీ పురస్కారం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈనెల 23వ తేదీన గంటా కమలమ్మ సాహితీ పురస్కారం నిర్వహించనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు గంటామోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 23వ తేదీ నగరంలోని మిట్టూరులో ఉన్న విజయం డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గంటా కమలమ్మ స్మారక కవితా పురస్కారం -2024 పోటీల్లో ఎంపికైన 'నాలుగు రెక్కల పిట్ట (సాంబమూర్తి లండ (శ్రీకాకుళం), చింతల తొవ్వ' (తుల శ్రీనివాస్, నల్గొండ)కు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పురస్కారాల పోటీలకు ఉభయ రాష్ట్రాల నుంచి 35 కవితా సంపుటాలు వచ్చినట్లు చెప్పారు. న్యాయనిర్ణేతలుగా ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ రాధేయ (అనంతపురం), ఆచార్య డాక్టర్ రఘు (ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాద్) వ్యవహరించారన్నారు. పురస్కార గ్రహీతలకు రూ.10 వేల నగదు, జ్ఞాపికతో సత్కరించనున్నట్లు తెలిపారు.

సమష్టి కృషితోనే పీవీకేఎన్‌కు నాక్ 'ఏ' గ్రేడ్



నాక్ సర్టిఫికెట్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్ : అందరి సమష్టి కృషితోనే పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ 'ఏ' (3.13 సీజీపీఏ) గ్రేడ్ వచ్చిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. శుక్రవారం ఆ కళాశాలలో నాక్ 'ఏ' గ్రేడ్ సర్టిఫికెట్‌ను ఆవిష్కరించి, అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎంతో చరిత్ర కలిగిన పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రెండవసారి నాక్ ఏ గ్రేడ్ లభించడం గర్వకారణమన్నారు. గ్రేడ్ సాధనకు అధ్యాపక బృందం ప్రణాళికతో కష్టపడ్డారని అభినందించారు. భవిష్యత్‌లో పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యూనివర్శిటీ అయ్యే అవకాశాలున్నాయని తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్, అధ్యాపకులు నాక్ ఏ గ్రేడ్ సర్టిఫికెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మీరాసాహెబ్, సీనియర్ అధ్యాపకులు హరిప్రసాద్ , శరవణ, గోపినాయక్, భాను, పలువురు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 59,776 మంది స్వామివారిని దర్శించుకోగా 22,386 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.24 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కొందరు అదృష్టమంటారు.. మరికొందరు జీన్స్ అంటారు.. ఏదైనా కవలల పుట్టుక విభిన్నం.. విచిత్రం..రూపం..భావం..భావన ఒకేలా ఉండడం అందరిలోకి కవలలు ఒక ప్రత్యేకతగా నిలుస్తారు.. ఆటలు, పాటలు, అభిరుచులు, పోటీలు కవలల్లో కొందరు ఒకేలా చేయడం.. మరికొందరు కవలల్లోనూ భేదం ఉండడం ప్రత్యేకతగా నిలుస్తున్నారు. ఒకసారి చూసి మళ్లీ గుర్తించాలంటే అందరూ తికమక పడాల్సిందే..ఇక కవలలందరూ ఒకేచోట చేరితే ఇక ఆ వేడుక అందరూ చూడాలంతే..నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



సంసిద్ధ్ క్యాంఫోర్డ్ పాఠశాలలో ఒకే ఫ్రేమ్‌లో 24 మంది కవలలు

అమ్మ గీసిన..అపురూపం

- జిల్లా కేంద్రంలోని సంసిద్ధ్ క్యాంఫోర్డ్‌లో కవలల సమూహం
- కవలల జన్మ ఓ ప్రత్యేకం
- నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం



చిత్తూరు కలెక్టరేట్ : ఒకే ప్రసవంలో ఒక్కరి కన్నా ఎక్కువ మంది జన్మిస్తే వారిని కవలలుగా.. ఒకే గర్భం నుంచి జన్మించిన ఇద్దరు పిల్లలు కవలలే.. కవలల జన్మ ఓ ప్రత్యేకం. ఒకే రోజు నిమిషాల వ్యవధిలో తల్లి గర్భం నుంచి కవలలుగా జన్మించి సంభ్రమాశ్చర్యం కలిగించటం చూస్తూనే ఉంటాం . వారిలో ఎవరు చిన్న, ఎవరు పెద్ద తెలుసుకోవటానికి తికమక పడతాం. అలాంటి కవలలను కన్న తల్లిదండ్రుల ఆనందానికి అవధులు ఉండవు.
కవలలకు ఒకేలా దుస్తులు, స్కూల్ యూనిఫామ్ వేస్తే వారిని అడిగి తెలుసుకుంటే తప్ప గుర్తించలేం . అంతగా దగ్గరి పోలికలతో ఉంటారు. కవలల దినోత్సవం మొట్టమొదట పోలెండ్‌లో 1976 లో జరుపుకున్నారు. పోలెండ్‌లో జన్మించిన మోజస్, ఆరన్ విల్‌కాక్స కవల సోదరులు మరణించిన రోజును అంతర్జాతీయ కవలల దినోత్సవంగా ఏటా ఫిబ్రవరి 22న జరుపుకుంటున్నారు. కళ్లెదుట అనేక మంది కవలలను చూస్తుంటాం. వారిలో కొంత మందిపై కథనం.

అందరూ ఒకే ఫ్రేమ్‌లో...

ఒకే కాన్పులో పుట్టిన కవలలు అపురూపంగా ఉంటారు. చూసేవారిని తికమక పెడుతారు. వారి ఆలోచనలు, అభిరుచులు ఒక్కటిగానే ఉంటాయి. కొందరిని అస్సలు గుర్తుపట్టడం అంత తేలికకాదు. కవలల దినోత్సవం సందర్భంగా చిత్తూరు సంసిద్ధ్ క్యాంఫోర్డ్ పాఠశాలలో 24 కవలల జంటలు ఒకే ఫ్రేమ్‌లో కనువిందు చేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల కరస్పాండెంట్ మహేష్, అధినేత శ్రీనివాస రావు మాట్లాడుతూ.. ఒకే రూపంలో ఉండే కవలలు ఒకే పోలికతో సమరూప, సహజాత కవలలు అనిపించుకుంటున్నారన్నారు. అనంతరం కవలల విద్యార్థులకు ఆ పాఠశాలలో శుక్రవారం క్రీడా పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

అందరూ తికమకే..



చిత్తూరు నగరంలోని రామమూర్తి కుమార్తెలు దాక్షిత, దాక్షికలను చూస్తే అందరూ తికమకపడాల్సిందే. ఒకేలా ఉండటమే కాకుండా ఒకే అభిరుచులు, ఇష్టాలతో అందరినీ తికమక పెట్టేస్తుంటారు. ఒకే రూపుతో ఆకట్టుకునే ఈ అక్కాచెల్లెళ్లలో తల్లిదండ్రులు ఒకరి కోసం ఏ వస్తువు కొన్నా మరొకరికి అదే కొనాల్సిందే. అది కూడా ఒకే డిజైన్‌తో ఉండాల్సిందే. డ్రస్సులు, ఆభరణాలు, ఆట వస్తువులు ఇలా ఇద్దరికీ ఒకేలా ఉన్నవే కొనాలి. లేకపోతే ఆ రోజు గొడవే. జ్వరం వచ్చినా, జబ్బు చేసినా ఇద్దరికీ ఒకేసారి వస్తుంది. భోజనం, అల్పాహారం ఇద్దరి ప్లేట్లలో ఒకేలా ఉండకపోతే ఏడ్చేస్తారు. పాఠశాలకు ఒకరు డుమ్మా కొడితే మరో అమ్మాయి పోనని మారం చేస్తుంది. ఏ పనిచేసినా ఇద్దరూ ఒకేలా చేస్తుండడమే ఇందుకు కారణమని తల్లిదండ్రులు తెలిపారు. – దాక్షిత, దాక్షిక

గుర్తుపట్టడం కష్టమే



చిత్తూరు రూరల్ పీబీ అగ్రహారానికి చెందిన నీరజాక్షులు, శకుంతల దంపతులకు భావన, భవిష్య అనే కవలలున్నారు. ముచ్చట గొలిపేలా వీరిద్దరు యూనిఫాంతో స్కూల్‌కు వెళ్తుంటే గుర్తించేందుకు పలువురు తికమక పడుతుంటారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు, స్నేహితులు కూడా ఒక్కసారిగా చూస్తే గుర్తించడం కష్టమేనని చెప్పారు. ప్రస్తుతం వీరిద్దరూ 6వ తరగతి చదువుతున్నారు. – భావన, భవిష్య

ఒకరంటే మరొకరికి ప్రేమ



నగర సరిహద్దులోని దొడ్డిపల్లిలో ఉంటున్న కిశోర్‌కుమార్, నదియ దంపతుల కుమార్తెలు ప్రవీణ, ప్రీతి కవలలు. వీరు ఒకరికి ఒకరు ప్రతిరూపంగా కనిపిస్తారు. ఒకరిని వదిలి ఇంకొకరు ఉండలేరు. అభిప్రాయాలు, ఇష్టాలు, అభిరుచులు అన్నీ ఒకే తీరుగా ఉంటాయి. ఒకరంటే ఒకరు అవాజ్యమైన ప్రేమ కనబరిచే వీరిద్దరు నాలుగో తరగతి చదువుతున్నారు. – ప్రవీణ, ప్రీతి

బింబం, ప్రతిబింబం..



చిత్తూరు నగరానికి చెందిన న్యాయవాది కృష్ణకిశోర్, మంజులరాణి దంపతులకు జన్మించిన అర్జున్, అంజన్ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఒకే ముఖ కవళికలతో కన్పిస్తుంటారు. బింబ, ప్రతిబింబాలుగా నిలుస్తారు. వారి అభిలాష ఒకే విధంగా ఉంటాయి. వీరిద్దరి అభిరుచులు దాదాపు ఒకటిగానే ఉంటాయి. ఎంతో చలాకీగా ఉంటారు. ఈ ఇద్దరి జన్మదినం కూడా కవలల దినోత్సవం రోజునే కావడం మరో విశేషం. ప్రస్తుతం వీరిద్దరూ 8వ తరగతి చదువుతున్నారు. – అర్జున్, అంజన్

గుర్తుపట్టలేనంతగా ...



నగరంలోని చంద్రశేఖర్, లక్ష్మీదేవి దంపతులకు బబిత, భవిష్య కవలలున్నారు. అల్లరిలో వారి ఇద్దరూ ఇద్దరే. ఎక్కడికెళ్లినా ఇద్దరినీ తీసుకెళ్లాల్సిందే. ఏది తెచ్చినా ఇద్దరికీ తీసుకురావాల్సిందే. ఇద్దరూ ఒకే రకమైన ఆహారాన్ని ఇష్టపడుతారు. వీరిని పోల్చుకునేందుకు తల్లిదండ్రులు తంటాలు పడుతుంటారు. పాఠశాలలో ఇద్దరినీ గుర్తుపట్టలేక టీచర్లు తికమకకు లోనవుతుంటారు. – బబిత, భవిష్య

ఒకేలా పనులు



చిత్తూరులోని మధు, సాయిరాణి దంపతుల కవలలు హేమచంద్ర, అభినవ్. వీరిద్దరి ఆలోచనలు ఒకేలా ఉంటాయి. ముఖ్యంగా ఇద్దరి ఆహారపు అలవాట్లు, అభిరుచుల విషయంలో ఒక్కలాగా ప్రవర్తిస్తారని తల్లిదండ్రులు చెబుతున్నారు. వారు పెరుగుతున్న కొద్దీ ప్రతి దాంట్లో పోటీ ఎక్కువగా ఉంటోదంటున్నారు. చూడటానికి సన్నగా ఉన్నా వారి ఉత్సాహాన్ని చూసి ఉపాధ్యాయులే ముచ్చట పడుతుంటారు. – హేమచంద్ర, అభినవ్

అభిరుచులు వేరు



జాహ్నవి, జస్విని, కల్లుపల్లి

గంగవరం మండలం కల్లుపల్లికి చెందిన జయచంద్రారెడ్డి, భవానీ దంపతుల కవలలు జాహ్నవి, జస్విని. వీరు పలమనేరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో అయిదో తరగతి చదువుతున్నారు. సాధారణంగా కవలలు ఒకే ఆలోచలను కలిగి ఉంటారు. కానీ వీరి అభిరుచులు మాత్రం వేర్వేరుగా ఉంటాయి. ఒకరి అభిప్రాయాన్ని మరొకరు పట్టించుకోకుండా సొంత ఆలోచనలతో ముందుకెళ్తున్నారు. ఒకరేమో మహా అల్లరిగా ఉండగా మరొక అమ్మాయి సైలెంట్‌గా ఉంటోంది.

ఒక్కరిని వదలి ఉండలేరు



ధనుష్ జెట్టి, ధర్మేష్ జెట్టి, కమ్మపాళెం

పెద్ద పంజాణి మండలం కమ్మపాళెం గ్రామానికి చెందిన పద్మనాభజెట్టి కుమారులు ధనుష్ జెట్టి, ధర్మేష్‌జెట్టి కవలలు. వీరి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నారు. వీరు ఒక్కరిని వదలి మరొక్కరు ఉండరు. ఎప్పుడూ ఇద్దరూ కలిసి ఉండాల్సిందే. బడికి ఒక్కరు పోకున్నా ఇంకొకరు వెళ్లని పరిస్థితి. ఇద్దరికీ సేమ్ టు సేమ్ డ్రెస్ కోడ్ ఉండాల్సిందే.

కవలలిద్దరూ ప్రతిభావంతులే



విఘ్నేష్, విర్నేష్, గాండ్లపల్లి

వీకోట మండలం గాండ్లపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ కుమారులు విఘ్నేష్, విర్నేష్ కవలలు. వీరు ప్రస్తుతం మహారాష్ట్రలోని చంద్రాపూర్ సైనిక్ స్కూల్‌లో చదువుతున్నారు. వీరు కరాటేలో బ్లాక్ బెల్టులు సాధించారు. నాలుగు సార్లు జాతీయ స్థాయిలో చాంపియన్స్‌గా నిలిచారు. ఇద్దరూ ఒకే కోర్సు చేసి దేశానికి సైనికులు కావాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నారు. – పలమనేరు

అక్రమార్కులకు ఉపాధి

ఉపాధి హామీ పనులు కొందరి కూటమి నేతలకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. వలసలు నివారించేందుకు ఉద్దేశించిన పథకం అక్రమార్కులకు వరంగా మారింది. చేసిన పనులనే మళ్లీ చేయడం..బోగస్ హాజరు పెట్టి దండుకోవడం.. పనులు చేయకున్నా బిల్లులు పొందడం.. కూలీలు రాకుండానే వచ్చినట్లు మస్టర్లు సృష్టించడం.. సాంకేతికతను పక్కదారి పట్టించి ..అధికారుల కళ్లకు గంతలు కట్టి దర్జాగా ఉపాధి నిధులను నిలువు దోపిడీ చేస్తున్నారు.



వావిల్‌తోటలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

- కూటమి నేతలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు కుమ్మక్కు
- పనులు చేయకుండానే బిల్లులు
- చేసిన చోటే మళ్లీ పనులు
- బోగస్ కూలీల నమోదు

కాణిపాకం : పూతలపట్టు మండలం వావిల్‌తోట పంచాయతీలో ఉపాధిహామీ పనుల పేరుతో అక్రమాలు జరుగుతున్నట్లు అధికారులకు కొందరు ఫిర్యాదు చేశారు. పనులు జరగకుండానే..కాలువ పని పేరుతో రోజుకు 180 మందికి మస్టర్ వేస్తున్నారని అందులో పేర్కొన్నారు. 10 మందితో 180 మంది పనిచేస్తున్నట్లు చిత్రీకరిస్తున్నారని, 10 మందిని వివిధ చోట్ల పని చేస్తున్నట్లు చూపిస్తున్నారని ఫొటోల సహా ఆన్‌లైన్ వివరాలను పంపారు. ఇలా వారానికి రూ.3 లక్షల వరకు కొల్లగొట్టారని అందులో ఆరోపించారు. ఆరు నెలల కాలంలో రూ.30 లక్షలు మింగేశారని గ్రామస్తులు ఫిర్యాదులో వివరించారు. కూటమి నేతలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు కుమ్మక్కై ఉపాధి డబ్బులు దోచేస్తున్నా రు. ఇష్టానుసారంగా పనులు చేస్తూ అయిన కాడికి దండుకుంటున్నారు. గుట్టుచప్పుడు కాకుండా బోగస్ కూలీలను సృష్టిస్తూ మస్టర్‌లో మాయజాలంను సృష్టిస్తున్నారు. సాంకేతికతకు చుక్కలు చూపిస్తున్నారు. వేతనం గిట్టుబాటు లేకపోవడంతో కూలీలు అల్లాడిపోతున్నారు. చివరకు కూలీలే ఛీకొట్టే పరిస్థితి దాపురించింది. ఈ తతంగంపై ఉపాధిహామీ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

అనుకూలమైన వారిని నియమించుకొని..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లోని కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. వారి స్థానంలో స్థానిక కూటమి నేతలకు అనుకూలమైన వ్యక్తులను నియమించుకున్నారు. కూటమి నేతలతో వారు కుమ్మక్కై ఉపాధిలో అక్రమాల వేటను మొదలుపెట్టారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

తప్పుల తడకగా మస్టర్‌లు

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కొందరు నేతలు ఉపాధిని లక్ష్యంగా చేసుకున్నారు. మేట్లను అడ్డుపెట్టుకుని ఉపాధి పనుల్లో కాసులు దండుకుంటున్నారు. రెండేళ్ల కిందట మ్యానువల్‌గా మస్టర్లు వేసేవారు. ఈ మస్టర్లు తప్పులు తడకగా ఉండడంతో పాటు పలు అక్రమాలు వెలుగు చూశాయి.

ఫొటోలతో మాయ..

10 మందిని తీసుకొచ్చి... వాళ్లతో పలుచోట్ల పని చేయిస్తున్నట్లు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఆ పంచాయతీలోని కూలీలు రాకుంటే పక్క గ్రామంలో 10 మందిని తీసుకొచ్చి ఫొటోలతో పనిచేసినట్లు సృష్టిస్తున్నారు. ఇలా రోజువారీ 100 నుంచి 180 మంది బినామీ పేర్లు పెట్టి పనిచేయిస్తున్నట్లు ఆన్‌లైన్‌లో మస్టర్లు వేస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు వెలుతున్నాయి.

యంత్రాలతో పనులు

పంట సంజీవని, ఇతర పనులను యంత్రాలతో పనులు చేయించి బినామీ కూలీలతో బిల్లులు చేసుకుంటున్నారని చెబుతున్నారు.

మండలం	పంచాయతీలు	గుర్తించిన పనులు	మస్టర్ల సంఖ్య	పనికి హాజరవుతున్నవారు
చిత్తూరు	17	47	113	610
గుడిపాల	27	55	149	860
బంగారుపాళ్యం	41	90	295	1209
ఐరాల	28	129	228	1540
పూతలపట్టు	25	103	172	1127
తవణంపల్లి	32	68	123	589
యాదమరి	26	36	103	740

తనిఖీలున్నా..తగ్గేదేలే..

ఉపాధి హామీలో జరుగుతున్న పనులకు సంబంధించి ఏటా సామాజిక తనిఖీలు చేపడుతుంటారు. ఇందుకు సీఆర్‌పీలు, డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు బృందంగా వెళ్లి పనులను పరిశీలిస్తుంటారు. ఏవైనా అక్రమాలుంటే వెంటనే బహిరంగ సభలో బహిర్గతం చేయాల్సి ఉంటుంది. వీటిని సైతం లెక్క చేయకుండా కూటమి నేతలు, క్షేత్ర సహాయకులు అధికారం ఉందని అడ్డదిడ్డంగా వ్యవహరిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టి తనిఖీలను మట్టుపెట్టవచ్చునని భావిస్తున్నారు. ఆ సమయానికి కాసులిచ్చి అక్రమాలను కప్పిపుచ్చుకోవచ్చని నిర్భయంగా ఉపాధి నిధులను బినామీల పేరుతో కాజేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధిహామీ పనుల్లో జరుగుతున్న అక్రమాలకు కళ్లెం వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

వావిల్‌తోటలో జరిగిన పనులపై ఫిర్యాదులు అందా యి. దీనిపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. చేపట్టిన పనులపై ఆరా తీస్తున్నారు. రెండు రోజుల్లో ఏం జరిగిందో వాళ్లే చెబుతారు. ఉపాధి హామీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసులు, క్లస్టర్ ఏపీడీ, పూతలపట్టు

మొక్కుబడిగా చైర్మన్ పర్యటన

– సమస్యల పరిష్కారంపై నోరు మెదపని వైనం



మాట్లాడుతున్న ఏపీ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఏపీ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్ పర్యటన మొక్కుబడిగా సాగింది. సమావేశం మమ అనిపించేలా నిర్వహించి కలెక్టర్‌ను కలిసి వెళ్లిపోయారు.

ఎస్సీ కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తాం

ఎస్సీ కార్పొరేషన్‌ను బలోపేతం చేసి ఎస్సీలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్ అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2047లో ఎస్సీ కుటుంబాల నుంచి పారిశ్రామిక వేత్తలను తయారు చేస్తామన్నారు. మాల సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని చైర్మన్ అన్నారు. సలహాలు, సూచనలు తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 1000 యూనిట్లు అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చిన్నయ్య, డైరెక్టర్‌లు బాబు, కుమారి, యుగంధర్, డీవీఎంసీ సభ్యులు రాజ్‌కుమార్, మునస్వామి, వరలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని విద్యార్థి దుర్మరణం


బాలాజీ (ఫైల్)

పుత్తూరు : రైలు ఢీకొన్న ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి పుత్తూరు రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకొంది. రైల్వే ఎస్ఐ రవి కథనం మేరకు.. తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం అంజూరు గ్రామానికి చెందిన ఎం.బాలాజీ (20) పుత్తూరు బీసీ హాస్టల్‌లో ఉంటూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రైల్వే స్టేషన్ సమీపంలోనే హాస్టల్ ఉండడంతో గురువారం రాత్రి 8 గంటల సమయంలో పట్టాలు దాటుతుండగా రేణిగుంట నుంచి చెన్నై వెళుతున్న కొల్లాం ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లోకో పైలట్ రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

– ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

తవణంపల్లె : మండలంలోని తిరుపతి– బెంగుళూరు హైవేలో తెల్లగుండ్లపల్లె సమీపంలో డాబా వద్ద అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొనడంతో ముగ్గురు గాయపడినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కిరణ్‌కుమార్ (11) చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు. ఎస్ఐ కథనం మేరకు తిరుపతికి చెందిన వినయ్, కిరణ్‌కుమార్, నిరూప ముగ్గురూ ద్విచక్ర వాహనంలో వస్తుండగా వినయ్ వేగంగా ద్విచక్ర వాహనం నడిపి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్ తలకు తీవ్రమైన గాయం కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బైక్ నడుపుతున్న వినయ్, కిరణ్‌కుమార్ తల్లి నిరూప కూడా గాయపడ్డారు. మృతుడు కిరణ్‌కుమార్ తల్లి నిరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మద్యం స్వాధీనం

బంగారుపాళెం : మండలంలోని తుంబకుప్పంలో శుక్రవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మునిరత్నంరెడ్డి తన ఇంటి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. అతడి వద్ద నుంచి 30 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భక్తుడికే తొలి పూజ!

- శ్రీకాళహస్తీశ్వరాలయంలో అంగరంగ వైభవంగా భక్తకన్నప్ప ధ్వజారోహణం
- తరలివచ్చిన భక్తజనం



భక్తకన్నప్ప ఆలయంలో అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం కన్నప్ప ధ్వజారోహణంతో ఆగమోక్తంగా అంకురార్పణ చేపట్టారు. తొలి పూజను భక్తునికే చెందేలా శివుడు వరమిచ్చాడు. ఈ క్రమంలో భక్తకన్నప్ప ధ్వజారోహణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. భక్తుడైన కన్నప్ప ఉత్సవమూర్తికి అభిషేక పూజలు నిర్వహించారు.

ముక్కోటి దేవతలకు ఆహ్వానం

కన్నప్ప ఉత్సవమూర్తిని మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కొండపై వెలసిన కన్నప్ప ఆలయం వద్ద ఉత్సవమూర్తిని కొలువుదీర్చి గణపతి పూజ, పుణ్యాహ వచనం, మండప ఆరాధన, ధ్వజపూజ నిర్వహించారు. అనంతరం ధర్బ, మామిడాకులతో కట్టి తెల్లదారంతో దవళపతాకం, హారాన్ని ఎగురవేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ముల్లోకాల్లోని ముక్కోటి దేవతలకు సంకల్ప పూజతో వేదపండితులు శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికారు.

సంప్రదాయం..నైవేద్య సమర్పణం

తర్వాత కన్నప్ప ఉత్సవమూర్తిని తిరిగి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి సన్నిధి వీధిలో ఉభయదారులైన బోయ కులస్తులు ఏర్పాటు చేసిన విడిదిలో కొలువుదీర్చారు. బోయలు సంప్రదాయం ప్రకారం వస్త్రం, నైవేద్యం సమర్పించారు. అక్కడి నుంచి గ్రామోత్సవం ప్రారంభమైంది. రాజగోపురం నుంచి చతుర్మాడ వీధుల్లో కన్నప్ప గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

శాస్త్రోక్తంగా వాస్తు శాంతి పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాత్రి వాస్తు శాంతి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామోత్సవం ముగిసిన తర్వాత ఆలయంలో వేద పండితులు గణపతి హోమం చేపట్టారు. అలాగే ఆలయానికి వాస్తు శాంతి హోమం నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, ఈవో బాపిరెడ్డి పాల్గొన్నారు.


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

టీటీడీ బోర్డు సభ్యుడిని తొలగించాలి

– మాజీ మంత్రి ఆర్కేరోజా


ఆర్కేరోజా, మాజీ మంత్రి

నగరి : టీటీడీ ఉద్యోగిపై అనుచితంగా ప్రవర్తించిన బోర్డు సభ్యుడిని తొలగించాలని మాజీ మంత్రి ఆర్కేరోజా ఎక్స్‌లో డిమాండ్ చేశారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానమని, అలాంటి గొప్ప వ్యవస్థలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉద్యోగులు సేవలు అందిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో వున్న ఉద్యోగిపై బోర్డు సభ్యుడు అనుచితంగా ప్రవర్తించడం తగదన్నారు. ఇలాంటి ఘటనలు గతంలో ఎన్నడూ జరగలేదని, కూటమి ప్రభుత్వంలోనే జరుగుతున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి ఎదుటే చైర్మన్, ఈఓ నిందించుకున్నారంటే పాలన ఎంత బాగుందో అర్థమవుతోందన్నారు. జగనన్న పాలనలో ఇలాంటి ఘటనలు ఏ రోజూ జరగలేదన్నారు. పాలకుడు అంటే భయం ఉంటే పరిస్థితులు సవ్యంగా ఉంటాయన్నారు. వెంటనే బాధ్యతా రహితంగా ప్రవర్తించిన బోర్డు సభ్యుడిని ప్రభుత్వం తొలగించాలన్నారు. ఆత్మ గౌరవం కోసం ఆందోళన చేస్తున్న టీటీడీ ఉద్యోగులకు సంఘీభావాన్ని ప్రకటిస్తున్నానన్నారు.

మామిడిలో తెగుళ్ల నివారణకు చర్యలు

బంగారుపాళెం : మామిడిలో సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని గోవర్ధనగిరి, తగ్గువారిపల్లె గ్రామాల్లో రైతుల మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మామిడి తోటల్లో పూత దశలో కనిపించే పురుగు, తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పూత దశలో గొంగళి పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లేదా రోగర్ 2 మి.లీ, వేపనూనె 2 ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. లేదా జంప్ 0.4 గ్రాములును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడిలో కవర్ల ఏర్పాటు చేసుకోవడం ద్వారా నాణ్యమైన పంటను పొందేందుకు అవకాశం ఉందన్నారు. మామిడి కవర్లను ఉద్యానశాఖ ద్వారా 50 శాతం రాయితీతో రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. రాయితీ మామిడి కవర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సాగరిక, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆవులపబ్బం

చౌడేపల్లె : మండలంలోని పరికిదొన గ్రామంతో పాటు మరో పదకొండు గ్రామాల్లో రెండు రోజులుగా నిర్వహించిన ఆవులపబ్బం పండుగ శుక్రవారంతో ముగిసింది. గడ్డంవారిపల్లె, పరికిదొన, ఆమినిగుంట పంచాయతీల్లోని పన్నెండు గ్రామాలకు చెందిన మహిళలు ఊరేగింపుగా కాటమరాజుల ఆలయం వద్దకు చేరుకొన్నారు. అనంతరం భక్తి శ్రద్ధలతో కాటమరాజు స్వామికి , నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండేలా కరుణించాలని శాంతి పూజలు చేశారు.



విద్యుత్ శాఖకు చిత్తూరు జిల్లా పరిధిలో ప్రభుత్వ శాఖలు షాక్ ఇస్తున్నాయి. ఆయా కార్యాలయాలకు వినియోగించిన విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో బకాయిలు రూ.కోట్లకు చేరాయి. ప్రధాన శాఖల బకాయిలు పెరిగిపోతున్నా నిధులు మాత్రం సకాలంలో విడుదల కావడం లేదు. ఇందులో అత్యధికంగా పంచాయతీల బకాయిలు ఉండగా తర్వాత మున్సిపాలిటీలు, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యా, పంచాయతీరాజ్, రెవెన్యూశాఖలు తొలి 5 స్థానాల్లో ఉన్నాయి.


పలమనేరు మున్సిపాలిటీ కార్యాలయం

బకాయిల షాక్

- ప్రభుత్వ కార్యాలయాలకు గుదిబండగా విద్యుత్ బిల్లులు
- 11 శాఖల విద్యుత్ బకాయి రూ.22 కోట్లు
- అత్యధికంగా గ్రామ పంచాయతీ బకాయి రూ.420 కోట్లు

ప్రభుత్వశాఖలు	బకాయిలు (రూ.కోట్లలో)
మున్సిపాలిటీలు	10
ఆర్‌డబ్ల్యూఎస్	2.67
విద్యాశాఖ	1.76
పంచాయతీరాజ్	1.70
రెవెన్యూ	1.53
మెడికల్	1.35
ఇరిగేషన్	91.82 లక్షలు
వెల్ఫేర్	67 లక్షలు
అగ్రికల్చర్	60 లక్షలు
ట్రాన్స్‌పోర్ట్	31 లక్షలు
పోలీసుశాఖ	22.87 లక్షలు

చిత్తూరు కార్పొరేషన్ : నిధుల సమస్యతో బిల్లుల చెల్లింపులో జాప్యం నెలకొందని ఆయా శాఖల అధికారులు పేర్కొంటున్నారు. పేదలు గడువులోపు బిల్లు చెల్లించకపోతే కనెక్షన్ తొలగిస్తారు. గడువు దాటితే అపరాధ రుసుం వసూలు చేస్తారు. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోవడం ఏమిటని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

11 శాఖలు రూ.22 కోట్లు

జిల్లాలో ప్రధానంగా 12 శాఖల ద్వారా రూ.22 కోట్లు బకాయిలు జనవరి నెల వరకు ఉంది. ఇందులో మున్సిపాలిటీలు అధికంగా ఉన్నాయి. ఎక్కువగా పలమనేరు మున్సిపాలిటీ నుంచి రూ.3.76 కోట్లు రావాల్సి ఉంది. ఆ తర్వాత జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ (ఆర్‌డబ్ల్యూఎస్), విద్యాశాఖ, పంచాయతీరాజ్, రెవెన్యూశాఖలు ఉన్నాయి. ఆరు నెలలుగా నిధులు సమస్యలు ఎదురవుతున్నాయని అందుకే సకాలంలో బిల్లులు చెల్లించలేకపోతున్నామని ఆయా ప్రభుత్వ కార్యాలయాల అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ శాఖ బకాయిలు వసూలు తప్పనిసరిగా చేయాలని గతంలో ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఆదేశించింది. అయినా ఫలితం లేకుండా పోయింది.

నష్టాల పేరుతో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అయిదు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచింది. అయితే ప్రభుత్వ శాఖ విద్యుత్ బకాయిలకు నిధులు సకాలంలో విడుదల చేయడం లేదు. వీటిని వసూలు చేయడంలో అధికారులు నామమాత్రపు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

గ్రామ పంచాయతీల బకాయిలు రూ.420 కోట్లు

చిత్తూరు జిల్లాలో మొత్తం 697 పంచాయతీలు న్నాయి. కొన్నినెలలుగా మేజర్ పంచాయతీల పరంగా రూ.38.9 కోట్లు, మైనర్ పంచాయతీల పరంగా రూ.381.46 కోట్లు బకాయిలు ఉంది. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు సర్కార్ స్మార్ట్ మీటర్లను బిగిస్తోంది. ఇది పూర్తి స్థాయిలో అమలయ్యాక తర్వాత ప్రీపెయిడ్ మీటర్‌గా మార్చనున్నారు. అప్పుడు రీచార్జ్ చేసుకుంటేనే కార్యాలయాలకు కరెంటు వస్తుంది. అంటే ఈ వందల కోట్లు బకాయిలు కొరకరాని కొయ్యగా విద్యుత్‌శాఖ నెత్తిమీద పడనుంది. సామాన్యుడు బిల్లు కట్టడం ఆలస్యమైతే ఇంటికెళ్లి ఫ్యూజ్ తీసుకొని నానా తిప్పలు పెట్టడం సిబ్బందికి అలవాటు. మరీ ప్రభుత్వ శాఖలపై ఎందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

డిమాండ్ నోటీసులు ఇస్తున్నాం

జిల్లాలోని వివిధ శాఖల విద్యుత్ బకాయిలు రూ.22 కోట్లకు చేరాయి. ఎక్కువగా పంచాయతీ బకాయిలు రూ.420 కోట్ల వరకు ఉంది. వీటి వసూలుకు తగిన చర్యలు చేపట్టాం. ఈ బిల్లులను వీలైనంత త్వరగా చెల్లించి సంస్థ అందించే మెరుగైన సేవల్లో భాగస్వాములు కావాలి. ప్రతి నెలా డిమాండ్ నోటీసులు ఇచ్చి, బిల్లులు చెల్లించాలని కోరుతున్నాం. – ఇస్మాయిల్ అహ్మద్, ఎస్‌ఈ , ట్రాన్స్‌కో

అత్త చెయ్యి నరికిన అల్లుడు


తెగిపడిన షమీల చెయ్యి

గంగవరం: తన భార్యపై కత్తితో దాడికి ప్రయత్నించిన ఓ వ్యక్తి... అడ్డు వచ్చిన అత్త చెయ్యి నరికేశాడు. ఈ ఘటన గంగవరం మండలంలోని గండ్రాజుపల్లి పంచాయతీ పెద్ద ఉగిణి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... పెద్ద ఉగిణి గ్రామానికి చెందిన యూనిస్, సాల్మాకు రెండేళ్ల కిందట వివాహమైంది. యూనిస్ మద్యానికి బానిసగా మారి తనను వేధిస్తున్నాడని సల్మా వారం కిందట పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి రోజూ యూనిస్ మద్యం తాగి అత్తవారింటికి వెళ్లి గొడవ చేస్తున్నాడు. గురువారం రాత్రి కూడా మద్యం తాగిన యూనిస్ అందరూ నిద్రిస్తున్న వేళ కత్తి తీసుకుని అత్తవారింటికి వెళ్లి భార్య సల్మాపై దాడికి ప్రయత్నించాడు. ఆమె భయంతో ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకుంది. ఆ సమయంలో అడ్డువచ్చిన అత్త షమీలపై యూనిస్ కత్తితో దాడి చేయగా, ఆమె చెయ్యి తెగి పడింది. సల్మా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గంగవరం పోలీసులు శుక్రవారం యూనిస్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన షమీలను చికిత్స కోసం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా, మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

కుప్పం డిపో అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక


ఆర్టీసీ ఎండీని కలిసి సన్మానిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం

కుప్పం : రాష్ట్ర ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారక తిరుమలరావును శుక్రవారం విజయవాడలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. అదే విధంగా కుప్పం ఆర్టీసీ డిపో అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేసినట్లు, దీన్ని పరిగణలోకి తీసుకొని కుప్పం ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట మాజీ తిరుపతి గంగమ్మ ఆలయ చైర్మన్ బి.ఎం.కె.రవిచంద్రబాబు పాల్గొన్నారు.

స్కూటర్ నుంచి పొగలు.. తప్పిన ప్రమాదం


వాహనం నుంచి వస్తున్న పొగలు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఓ స్కూటర్ నుంచి పొగలు రావడంతో స్థానికులు ఆందోళన పడ్డారు. ఆస్తి పన్ను చెల్లించడానికి ఓ మహిళ శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చారు. అనంతరం స్కూటర్ తీయడానికి వస్తుండగా ఉన్నట్టుండి లోపల నుంచి పొగలు వ్యాపించాయి. దీంతో కార్పొరేషన్ సిబ్బంది నీళ్లు పోసి మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పింది. వేడికి స్కూటర్‌లో వైర్లు షార్ట్ సర్క్యూట్ అయినట్లు తెలిసింది.

వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌పై కేసు నమోదు అభ్యంతరకరం

సాక్షి, అమరావతి: చిత్తూరు జిల్లా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌పై పోలీస్ కేసు నమోదు చేయడంపై అభ్యంతర వ్యక్తం చేస్తూ ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ రాష్ట్ర డీజీపీకు శుక్రవారం లేఖ రాశారు. చిత్తూరులోని ఇక్తేదార్ అలీ ఖాన్ షాహిద్ దర్గాకు చెందిన వక్ఫ్ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించారని, ఆక్రమణదారులకు వక్ఫ్ చట్టం 1995 ప్రకారం నోటీసులు జారీచేసినట్టు తెలిపారు. ఆక్రమణదారులపై వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ చిత్తూరు ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ ఫిర్యాదును పట్టించుకోకుండా, కబ్జాదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని తప్పుబట్టారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వక్ఫ్ ఆస్తులను అనధికారికంగా ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదుచేసే విధంగా జిల్లా ఎస్పీని ఆదేశించాలని సూచించారు.

ఇరువర్గాల ఘర్షణ

– ముగ్గురికి తీవ్రగాయాలు



గాయపడిన విజయప్రసాద్‌రెడ్డి, కస్తూరి, గోపి

గుడిపాల : ఇరువర్గాల ఘర్షణలో ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు.. చింతగుంటూరు గ్రామానికి చెందిన విజయప్రసాద్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి బంధువులు. విజయప్రసాద్‌రెడ్డి ఇంటి వద్ద ప్రహరీ నిర్మించేందుకు పూడికతీత పనులు చేపట్టారు. ఇక్కడ తనకు సంబంధించి భూమి ఉందంటూ సుబ్రమణ్యంరెడ్డి అడ్డు చెప్పాడు. దీంతో ఇరువురు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు గుడిపాల తహశీల్దార్ కార్యాలయానికి ఇద్దరిని పంపించగా వెంటనే మండల సర్వేయర్ సంఘటనా స్థలానికి వెళ్లారు. భూమికి సంబంధించిన రికార్డులను సుబ్రమణ్యంరెడ్డి చూపించారు. విజయప్రసాద్‌రెడ్డి చూపించలేకపోవడంతో 23వ తేదీకి తిరిగివస్తామని సర్వేయర్ చెప్పి వెళ్లిపోయారు. ఇంతలో ఇరువురికి మాటామాట పెరిగి ఘర్షణకు దిగారు. ఇందులో విజయప్రసాద్‌రెడ్డి(60), కస్తూరి(55), గోపి(45) గాయపడ్డారు. వెంటనే చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి మొగిలీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, శ్రీ కామాక్షమ్మ

బంగారుపాళెం : మండలంలోని మొగిలి గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి మునిరాజ, ధర్మకర్త విజయకుమార్ తెలిపారు. 23వ తేదీ నుంచి మార్చి 5వ తేదీ వరకు 11 రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. మొగిలీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 23న అంకురార్పణ, రాత్రి మూషిక వాహనంపై వినాయ కోత్సవం, 24న కలశస్థాపన, ధ్వజారోహణం, రాత్రి హంస వాహన సేవ, 25న అభిషేకం, అధికార నంది వాహనం, రాత్రి సింహ వాహన సేవ, 26న మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, రాత్రి లింగోద్భవ అభిషేకం, వృషభ వాహన సేవ, 27న కైలాసగిరి రావణ బ్రహ్మ వాహనం, రాత్రి శేష వాహనం, 28న గజవాహనం, రాత్రి కామధేను వాహనం, మార్చి 1వ తేదీ అభిషేకం, బృంగి వాహనసేవ, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ, 2న తెప్పు ఉత్సవం, అభిషేకం, బ్రహ్మ రథోత్సవం, 3న ఉదయం అభిషేకం, రాత్రి పుష్ప పల్లకి సేవ, 4న సూర్యప్రభ వాహనం, సాయంత్రం వసంతోత్సవం, త్రిశూల స్నానం, ధ్వజా రోహణం, రాత్రి చంద్ర ప్రభ వాహనం, శయనోత్సవం, 5న అభిషేకం, రాత్రి తెప్పోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పరమశివుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ముగిసిన లక్ష కుంకుమార్చన


స్వర్ణమ్మకు చిత్ర పటాన్ని అందజేస్తున్న ఈఓ

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో మాఘమాసం నెలలో అత్యంత వైభవంగా నిర్వహించే లక్ష కుంకుమార్చన పూజలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చరణాల మధ్య ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు చేసి దంపతులకు పూజా సామగ్రి అందజేశారు. అమ్మవారి ఉత్సవమూర్తి ఎదుట ప్రత్యేక పూజలు, గణపతి, చండీ హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి చేశారు. 145 మంది దంపతులు హాజరై కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయంలో రద్దీ నెలకొంది.

లక్ష కుంకుమార్చన పూజలో పెద్దిరెడ్డి సతీమణి

బోయకొండ గంగమ్మ ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న లక్ష కుంకుమార్చన కార్యక్రమానికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణమ్మ శుక్రవారం హాజరై పూజలు చేశారు. అనంతరం ఈఓ అమ్మవారి తీర్థ ప్రసాదాలతో పాటు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

అయ్యా.. నాబిడ్డను కాపాడండి!

వైద్యానికి డబ్బులేదని ఆవేదన చెందుతున్న తల్లి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జగన్నాథగౌడు పక్కనే తల్లి లక్ష్మమ్మ

పలమనేరు : కొన్నేళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయి హైదరాబాదులో మతిస్థిమితం లేక అక్కడి ఓ అనాథశ్రయంలో ఉంటూ ఇటీవల సోషల్ మీడియా ద్వారా ఇంటికి చేరిన బైరెడ్డిపల్లి మండలం రామనపల్లికి చెందిన జగన్నాథగౌడు విషయం తెలిసిందే. వారం రోజుల కిందట దాతల సాయంతో స్వగ్రామానికి చేరుకున్న ఇతను అప్పటి నుంచి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో అతని తల్లి లక్ష్మమ్మ బైరెడ్డిపల్లి పీహెచ్‌సీకి శుక్రవారం తీసుకెళ్లింది. జగన్నాథగౌడను పరిశీలించిన అక్కడి వైద్యులు అతడికి హెచ్‌బీ 2.7 ఉన్నందున వెంటనే ఏదైనా పెద్దాసుపత్రిలో వెంటనే రక్తం ఎక్కించాలని సూచించారు. అయితే కుప్పం పీఈఎస్ లేదా ఇతర ఆస్పత్రులకు వెళ్లేందుకు కనీసం చార్జీలకు కూడా డబ్బులు లేవని తల్లి ఆవేదన చెందుతోంది. ఎవరైనా దాతలు తన బిడ్డ బతికేందుకు సాయం చేయాలని వేడుకుంటోంది.

శాపంలా మారిన పేదరికం...

గ్రామానికి చెందిన లక్ష్మమ్మ భర్త క్రిష్టప్పగౌడు 24 ఏళ్ల కిందట మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు వాసు ఇంటర్ దాకా చదివి తల్లికి సాయంగా ఓ పాడి ఆవును మేపుకుంటూ కుటుంబానికి ఆసరాగా మారాడు. ఉండేందుకు ఇల్లు లేక అద్దెఇంట్లో ఉంటున్నారు. ఇతని సోదరుడే జగన్నాథగౌడు సైతం ఇంటర్ దాకా చదివి ఆపై హైదరాబాదులో ఉద్యోగం కోసం వెళ్లి మానసిక సమస్యతో అక్కడే కొన్నేళ్లుండిపోయాడు. ఎట్టకేలకు ఇటీవల మళ్లీ సోషల్ మీడియా ద్వారా స్వగ్రామానికి వచ్చాడు. ఇప్పుడు అనారోగ్యానికి గురై చావుబతుకులకు మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. రేషన్‌కార్డులో జగన్నాథగౌడు పేరు లేనందున ఆరోగ్యశ్రీ సైతం వర్తించడం లేదు. ఎవరైనా దాతలు కనీసం ఆస్పత్రి ఖర్చులకైనా సాయం చేయాలని ఆ తల్లి ప్రాధేయపడుతోంది. మనసున్న దాతలు సాయం చేయదలిస్తే ఇతని అన్న వాసు 97049 30278 నంబరును సంప్రదించాలని కోరుతున్నారు.

దినకరుడు విరిసె..

శ్రీవారు మురిసె



సదుం మండలంలోని కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రంలో శుక్రవారం సూర్య కిరణాలు స్వామి వారి విగ్రహాన్ని తాకాయి. ఈ నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దీనిని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు. - సదుం